క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న దళిత నాయకులు

పుంగనూరు: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎవరైనా విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని దళిత నాయకులు రాజు, శంకరప్ప, చెన్నరాయుడు హెచ్చరించారు. సోమవారం ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడారు. నీతినిజాయితీగా పుంగనూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డిని లోకేష్ విమర్శించడం బాధాకరమన్నారు. రాజకీయ అవగాహన లేని లోకేష్ ఏది పడితే అది మాట్లాడుతూ పెద్దిరెడ్డిని విమర్శిస్తే తగిన గుణపాఠం చెబుతామన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో పెంచుపల్లి కృష్ణ, శ్రీనివాసులు, రమణ, గోవిందు, గంగప్ప పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



పులిచెర్ల(కల్లూరు): కల్లూరు ఇందిరానగర్ కాలనీ వద్ద సోమ వారం ఉదయం జింక సమీపంలోని అడవి నుంచి జనావాసాల్లోకి వచ్చింది. అయితే కుక్కలు వెంటపడి జింకపై దాడి చేయడంతో మృతి చెందింది. స్థానికులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ సభ్యులు

పలమనేరు: ఈనెల 16, 17, 18 తేదీల్లో తిరుపతిలో జరిగే ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వీఆర్ జ్యోతి పిలుపునిచ్చారు. స్థానిక బాపూజీ పార్కులో సభలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక నాయకులతో కలసి సోమవారం ఆవిష్కరించారు. కార్మిక వర్గానికి బాసటగా నిలిచే పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఈసందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఇందులో ఉమాపతి, షహీనా, జానకిరామ్, మహేశ్వరి పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ కూర్మాయి గ్రామం వద్ద కుప్పం-పలమనేరు రహదారిపై సోమవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని ఆటోలో పలమనేరు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారు ఇదే మండలం నక్కపల్లికి చెందిన శివకుమార్(30), ఆర్ముగం(45)గా తెలిసింది. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు వీరిని కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలకు రెఫర్ చేశారు.

ఘనంగా రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు

సోమల: మండలంలోని ఆవులపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆవులపల్లె, పెద్ద ఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఉభయదారులుగా వాల్మీకి సంఘం వారు వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘ నేతలు

పలమనేరు: పెన్షనర్లకు సైతం రేషన్‌కార్డులను మంజూరు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తాము రుణపడి ఉంటామని ఏపీ పెన్షనర్ల సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం సహ అధ్యక్షుడు రత్నారెడ్డి మాట్లాడుతూ రూ.10 వేలు పింఛను పొందే గ్రామీణ ప్రాంతాలకు చెందిన పెన్షనర్లు, రూ.12 వేల పింఛను పొందే పట్టణ పెన్షనర్లు కూడా రేషన్‌కార్డులు పొందే అవకాశం ఉందన్నారు. వీటిని ఎలా పొందాలో సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ వివరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, గురుమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

- వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి, పర్వతనేనిని గెలిపించుకుందాం
- వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం
- చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నేటి శ్యాంప్రసాద్ రెడ్డి గెలుపునకు ఉపాధ్యాయులు, పట్టభద్రులు సహకరించాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ కోరారు. సోమవారం ఆయన మండల పరిధిలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులను కలసి శ్యాంప్రసాద్ రెడ్డి గెలుపునకు సాయం అందించాలని కోరారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి పట్టభద్రులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, పార్టీ నేతలు అప్పి, మంజునాథ్ రెడ్డి, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

పేర్నాటిని ఆదరించండి

పలమనేరు: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని పట్టభద్రులు ఆదరించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాలతో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు కలసి పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ జాఫర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలుపును కాంక్షిస్తూ ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డితో కలసిన పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. సదుం పంచాయతీలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉషారాణి, వెంకటరమణ, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ఎంపీపీ రామ్మూర్తి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి సంతగేటు వీధి, గద్దంవారిపల్లె రోడ్డు, కేటీ స్ట్రీట్, బజారు వీధి, మేదర దొడ్డి, హైస్కూల్ వీధి, గాంధీవీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దృశ్యకళల అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అంజిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ రుక్మిణమ్మ, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్, ఎంపీటీసీ రూపారేఖ, సర్పంచ్ వరుణ్‌భరత్ పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీగా శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: మండలంలోని పొదలగుంటపల్లె, ఎస్.నడింపల్లె, ఇరికిపెంట, కందూరు పంచాయతీల్లో ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల యూత్ అధ్యక్షుడు కుమార్ రాజ, తదితరులు పాల్గొన్నారు.







పలమనేరులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, కౌన్సిలర్లు, పులిచెర్లలో ప్రచారం చేస్తున్న మురళీధర్, సురేంద్రనాథ రెడ్డి, సదుంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ప్రచారం

'మంత్రి పెద్దిరెడ్డిని ఎదుర్కొనే సత్తా మీకు లేదు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోం
- నారా లోకేష్‌పై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ఫైర్

రొంపిచెర్ల: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే నాలుక కోస్తామని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన రొంపిచెర్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నార లోకేష్ తన యువగళం పాదయాత్రలో మంత్రి పెద్దిరెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఈ జిల్లాలో లోకేష్ తండ్రి చంద్రబాబుకు కూడా మంత్రి పెద్దిరెడ్డిని ఎదుర్కొనే సత్తా లేదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి ఎప్పుడూ కూడా నీతిమాలిన రాజకీయాలు చేయరని, అది గ్రహించుకోవాలన్నారు. మంత్రి పెద్దిరెడి తనను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రహీంఖాన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి చొరవతోనే మైనారిటీల అభివృద్ధి సాధ్యపడుతోందని తెలిపారు. రొంపిచెర్ల మండలంలో రూ.3 కోట్లతో మసీదులను అభివృద్ధి చేయిస్తున్నారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెంచురెడ్డి, యుగంధర్ రెడ్డి, కోటా వెంకటరమణ, నాగిరెడ్డి, అన్సర్‌బాషా, బాలాజీ, రామనారాయణ రెడ్డి, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపదను కాపాడుకుందాం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: అటవీ సంపదను ప్రజలే కాపాడుకోవాలని మంగళంపేట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అన్నారు. సోమవారం ఆయన రొంపిచెర్ల వారపు సంతలో అటవీ సంపద కాపాడుకోవడంపై కళాజాత సభ్యులతో అవగాహన కల్పించారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అడవులకు నిప్పు పెట్టడం, జంతువులను వేటాడడం నేరమన్నారు. అలాగే అటవీ సంపద ఎర్రచందనాన్ని వ్యాపారులు అక్రమంగా నరికి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. దీన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. వన్యప్రాణుల వేటాడడం, ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రజలు సమాచారం ఇస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో రొంపిచెర్ల బీట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

మహిళలతోనే సమాజాభివృద్ధి



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి సింధు, పక్కన పీఓ రా జేశ్వరి

పుంగనూరు: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, మహిళలతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధు తెలిపారు. సోమవారం సాయంత్రం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ కార్యాలయంలో పీఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అలాగే పట్టణంలోని కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్ కలసి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సింధు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటూ, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలను ఎలా వినియోగించుకోవాలో తెలుసుకుంటే మంచిదన్నారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులు, వాటి నివారణకు ప్రభుత్వం తయారు చేసిన చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు తమను తాము రక్షించుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు విజయకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అయేషా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గజ వాహనంపై కోదండరాముడు

శాంతిపురం: కోదండరామస్వామి వారు గజవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించా రు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారి పుణ్యకోటి ఉత్సవం నిర్వహించారు. అలాగే రాత్రి కోదండరాముడు గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాళ్లబూదుగూరు, చీమనపల్లి, బెంగళూరుకు చెందిన వీర శైవ కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ



బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్ రమేష్ బాబు

పెద్దపంజాణి: మండలంలోని పొట్టగానిపల్లికి చెందిన రాజేష్(42) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి మృతుని అంత్యక్రియలకు మంజూరైన రూ.10 వేలు బీమా నగదును రాజేష్ భార్య భూదేవికి అందజేసినట్లు స్థానిక సర్పంచ్ రమేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరంధామ, పీఎస్ గణపతి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మాంసపు వ్యర్థాలను దూరంగా పడేయండి



మాంసం దుకాణాదారులకు సూచనలిస్తున్న ఈఓపీఆర్డీ గఫూర్ సాహెబ్

సోమల: మాంసపు వ్యర్థాలను జనావాసాలకు దూరంగా వేయాలని ఈఓపీఆర్డీ ఎస్ఏ గఫూర్ సాహెబ్ సూచించారు. సోమవారం సచివాలయం-1లో మండల కేంద్రంలోని చికెన్, మటన్‌షాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు తాజా మాంసాన్ని మాత్రమే విక్రయించాలన్నారు. సకాలంలో లైసెన్స్ ఫీజులు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుధాకర్ కుమార్, దివ్యభారతి, వీఆర్‌ఓ శ్రీజ, సర్వేయర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

జీవితంలో పదో తరగతి మొదటి మెట్టు

రొంపిచెర్ల: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అన్నారు. సోమవారం రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి జీవితంలో ఎదగడానికి మొదటి మెట్టు వంటిదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఉర్దూ పాఠశాలలో ఈసారి పదోతరగతి ఫలితాల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థికి తాను రూ.5,116 నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ అనస్‌బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

బైరెడ్డిపల్లె: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర తెలిపారు. మండలంలోని బేలుపల్లెలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బీపీ, షుగర్, గర్భిణులు, బాలింతలను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

అదనపు పింఛన్లు మంజూరు చేయాలి

పుంగనూరు: విశ్రాంత ఉద్యోగుల ఖాతాకు జమ కావాల్సిన అదనపు పెన్షన్లను తక్షణమే విడుదల చేయాలని సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి కోరారు. సోమవారం విశ్రాంత ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలను వెంటనే జమ చేయాలన్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు భరత్‌భూషణ్, కేశవరెడ్డి, చంద్రశేఖర్, రమేష్, ఈశ్వర్‌కుమార్‌రెడ్డి, గంగులమ్మ, లీలావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సహకార బంధు'ను సద్వినియోగం చేసుకోండి

కుప్పం: జిల్లా సహకార బ్యాంకు ప్రవేశ పెట్టిన సహకార బంధు పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ కుప్పం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ గణేష్ తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అమల్లో ఉంటుందన్నారు. ఈ పథకంలో డిపాజిట్ చేస్తే 555 రోజులకు 7.25 శాతం, సీనియర్ సిటిజన్స్‌కు 8 శాతం వడ్డీ ఇస్తామన్నారు. సహకార బంధు రీఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లో డిపాజిట్‌పై వడ్డీ 7.70 శాతం, సీనియర్ సిటిజన్స్‌కు 8.54 శాతం వడ్డీ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. డిపాజిట్లకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ రక్షణ ఉంటుందని, వాణిజ్య బ్యాంకుల కంటే అధిక వడ్డీ పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. సోమవారం ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే సాయంత్రం శ్రీవారిని గజ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 9న ముగియనున్నాయి. 11 రోజుల పాటు జరిగే ఈ వార్షిక బ్రహ్మోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులోని వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా రాచపల్లె నంద, కార్యదర్శిగా మాచారం మహేష్, కోశాధికారిగా హేమంత్ కుమార్ ఎన్నికయ్యారు. వీరి చేత క్లబ్ గవర్నర్ వెంకటేశ్ బాబు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. నరసింహులు శెట్టి, భాస్కర శ్రీనివాసులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామకుప్పం: మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 1,850 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. సోమవారం విజిలెన్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో రామకుప్పంకు చెందిన రవి అనే వ్యక్తి బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని వి.కోటకు అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడ్డాడు. అనంతరం అతన్ని అరెస్ట్ చేసి, బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శివయ్య

సోమల: ఈ నెల 13న జరగబోయే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని పలమనేరు ఆర్డీఓ శివయ్య తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఆయన సోమవారం మధ్యాహ్నం పరిశీలించారు. పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు విడివిడిగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పోలింగ్ సందర్భంగా విధులు నిర్వహించే అధికారులు, ఏజెంట్లు కూర్చునే వరుస క్రమం, లైటింగ్, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ బాబు, ఆర్ఐ సుబుక్తుల్లా, హెచ్‌ఎం శివరత్నమ్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ..

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పలమనేరు ఆర్డీఓ శివయ్య సోమవారం తహసీల్దార్ మాధవరాజు, ఎంపీడీఓ సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. టీచర్ల కోసం ఒక పోలింగ్ కేంద్రంలో 53 మంది ఓటర్లు, పట్టభద్రుల కోసం 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో 1,326 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మౌలిక వసతులపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ సుధాకర్ నాయక్ ఉన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



పశుదాణాను పంపిణీ చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని రైతులకు పశువైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. సోమవారం చారాల పంచాయతీ పరిధిలోని బీర్జేపల్లెలో పశువులకు వ్యాధి సోకకుండా ఉండేందుకు టీకాలు వేశారు. మండలానికి 16500 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెలాఖరులోపు అన్ని గ్రామాల్లోనూ పశువైద్య సిబ్బంది టీకాలు వేస్తారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పాల దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఉచితంగా పశువులకు అందించే మినరల్ మిక్చర్ పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రెడ్డిప్రసాద్ ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



చౌడేపల్లె: మండలకేంద్రంలోని బజారు వీధిలో వెలసిన శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు రాజశేఖర దీక్షితుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, కల్లూరు, చిత్తూరు జిల్లా

రె.క.నెం.03/యాక్షన్స్/2020 తేదీ: 04.03.2023

బహిరంగ వేలపు నోటిఫికేషన్

ఇంతకుపూర్వము ఇందు నిమిత్తము జారీచేయబడిన యావత్తు నోటిఫికేషన్ మరియు నిబంధనలు ఇందుమూలముగా రద్దు గావించబడి ఈ నోటిఫికేషన్ కల్లూరు గ్రామ పంచాయతీచే తీర్మానము సంఖ్య 198 తేదీ 13.01.2023 గల తీర్మానం నందు ఆమోదించబడినది. 2023-2024 సం॥రము ఏప్రిల్ నెల 1వ తేదీ మొదలు 2024 సం॥రము మార్చి నెల 31వ తేదీ వరకు కూడిన ఒక సంవత్సరమునకు కల్లూరు గ్రామ పంచాయతీకి చెందిన క్రింది కనబరిచిన వాటికీ రుసుములు వసూలు చేయు హక్కును 09-03-2023వ తేదీ గురువారం 11.00 గంటలకు కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద సదరు పంచాయతీ కార్యదర్శి వారిచే లీజు ఇచ్చుటకు బహిరంగ వేలం వేయబడును వేలం నందు హెచ్చుపాటదారులు గ్రామ పంచాయతిచే ఖాయపరచబడిన తదుపరి 7 దినములలోపు పూర్తి పైకము చెల్లించి మరియు నూటికి రూ.3/- వంతున స్టాంపు డ్యూటీతో రిజిస్టర్ అగ్రిమెంటు చేసుకొనవలయును, మరియు టి.డి.యస్.జి.యస్.టి.లు చెల్లించి తగు రసీదులు పొందవలెయును. అట్లు చేయనియెడల వేలమును రద్దు పరిచి మరువేలము వేయబడును. సదరు వేలము నందు పాల్గొను వారు వాటి ఎదురుగా తెలిపిన ప్రకారము ధరావత్తు మొత్తమును ముందుగా "పంచాయతీ కార్యదర్శి, కల్లూరు" వారి పేరిట స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, వారి డి.డి. (డిమాండ్ డ్రాఫ్ట్)ల రూపములో మాత్రమే చెల్లించి వేలం నందు పాల్గొన వచ్చును. సదరు వేలము నందు పాల్గొను వారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బాకీ ఉండరాదు.

వ. సంఖ్య	గుత్త వివరములు	ధరావత్తు మొత్తము	సాల్వెన్సీ ధృవపత్రము మొత్తము	సాల్వెన్సీ లేనివారు చెల్లించవలసిన మొత్తము
1	దినవారపు సంత	5,00,000-00	4,00,000-00	6,00,000-00
2	ప్రైవేటు బస్టాండు (ఆర్.టి.సి./) ఏ.పి. టూరిజం ప్రభుత్వ వాహనం మినహా)	2,50,000-00	1,50,000-00	3,00,000-00
3	షాపింగు కాంప్లెక్సు గదులు-03, ఒక్కొక్క గదికి	10,000-00	20,000-00	20,000-00

మరియు పులిచెర్ల మండలం కల్లూరు గ్రామ పంచాయతీనకు 2023-2024 సం॥ నకు అవసరమైన ఈ క్రింది తెలిపిన పరికరములు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు గ్రామ పంచాయతీ కార్యాలయములో పంచాయతీ కార్యదర్శి వారిచే 09.03.2023 తేదీ ఉదయము 11.00 గం॥ల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు స్వీకరించబడును మరియు టెండర్లు హాజరైన వారి సమక్షములో సాయంత్రం 4.30 గంటలకు తేదీ 09.03.2023 తెరవబడును టెండరు షెడ్యూల్ విడివిడిగా రూ.200/- చెల్లించి టెండరు తేదికి 03 మూడు రోజుల ముందు తీసుకోవలెను.

వరుస నెం.	వివరములు	ధరవత్తు మొత్తము
1	నీటి సరఫరా పరికరములు	రూ.3,000/-
2	ప్రజారోగ్య పరికరాలు సరఫరా	రూ.2,000/-
3	స్టేషనరీ సరఫరా	రూ.1,000/-
4	మోటరు రిపేర్లు	రూ. 2,000/-

షరా: మిగతా వివరములకు కార్యాలయ పనివేళ లందు సంప్రదించగలరు.

సదరు బహిరంగ వేలము పాట మరియు టెండరును ఏదేని కారణము చూపకనే వాయిదా వేయుటకు మరువేలం జరుపుటకు పంచాయతీ కార్యదర్శి వారికీ అధికారము కలదు.

సం/- శ్రీ కె.యుగంధర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, కల్లూరు

సం/- శ్రీ యస్.ఏ.షుకూర్, సర్పంచ్, గ్రామ పంచాయతీ, కల్లూరు